
జైలు, నేరస్తుల్ని సంస్కరించ డానికేనా? అయితే, వొక్కసారి వచ్చినవాళ్ళు మళ్ళీ అక్కడికే రావలసిన పరిస్థితులకు కారణ మేమిటి? తిండి దొరకక పోవడమేనా?

# బచ్చా బ్యారక్

పెద్దిరెడ్డి




ఠంగ్, ఠంగ్: ఠంగ్, ఠంగ్—

జైలుగేట్లో నాలుగుగంటలు కొట్టారు.

"సబ్ ఠీక్ హైమ్ మ్ మ్" డ్యూటీలో వున్న జవాన్ నిద్ర వదలని గొంతు.

రాముడు కళ్ళు తెరిచాడు.

బారక్‌లో చీకటి.

కటకటాల్లోంచి కొద్దిగా వెన్నెల పడుతోంది.

ఈ రోజు తను యింటికి పోతాడు. రాముడికి గుర్తొచ్చింది. నిద్ర మంత్రం వేసినట్టు పారిపోయింది. లేచి బిస్తరిమీద కూర్చున్నాడు. దుప్పటి తప్పకుని తల వైపు బిస్తరికింద వెదికాడు. ఒక బీడీ దొరికింది. అట్లాగే ఒక అగ్గిపుల్లకూడ సంపాదించి బండమీదగీసి బీడీ ముట్టించాడు. ఒక దమ్ము గుండెలనిండా లాగి వదిలి గోడకు చేరగిలబడ్డాడు.

అర్నెల్లకిందట తానిక్కడికి వచ్చాడు. అప్పటికి తనకు బీడీ తాగడమింకా అలవాటు లేదు. ఘోరమయిన వంటరితనం, నరాలు తెంపే నిరాశ. తట్టుకోవాలంటే బీడీ లాంటిదేదో లేకపోకే సాధ్యంకాదనిపించింది. ఇప్పుడిక అది తన బతుకులో భాగమయింది. తనకొచ్చే అన్నం కొంత యితర్లకు పెట్టి అయినా బీడీలు కొనుక్కోక తప్పదు.

పొగ వదులుతూ చుట్టూరా చూశాడు రాముడు. చీకట్లో మిగిలిన పిల్లలు అస్పష్టంగా కనిపిస్తున్నారు. చీకట్లో వాళ్ళు కదుల్తూంటే చెమ్మ మట్టిలో కదుల్తూన్న వానపాము పిల్లల్లాగ వున్నారు. ఒకడు నిద్రలో గొణుక్కుంటున్నాడు వున్నట్టుండి. ఇంకొకడు పళ్ళు పటపట కొరికి మధ్యలో యెవర్నో బూతులు తిడుతున్నాడు. నల్లగా కాల్చిన కట్టెలావున్న వాడొకడు అదేపనిగా తొడలు గోక్కుంటున్నాడు అసహ్యంగా.

సరిగ్గా ఆర్నెల్లకింద తాను యిక్కడికి వచ్చాడు భయం, భయంగా యేడుస్తూ.

ఇక్కడకూడ మనుషులున్నారు. మామూలు మనుషులే. ఈ ఆర్నెల్లలో యెంతోమంది విడుదలయి వెళ్ళిపోయారు- మరెందరో వచ్చారు; పశుల కొట్టంలో పాత పశువులు పోయి కొత్త పశువులు రావడం జరిగినంత సహజంగా.

ఆ రోజు తను లోపలకు రాగానే ఈ బారక్‌కు పంపించాడు వార్డర్. దీని పేరు బచ్చా బారక్ అట. ఎవరికీ పద్దెనిమిదేండ్లకు మించవు. రాగానే "ఎందుకొచ్చినవు, ఏంజేసినవు." అనడిగాడు యిప్పుడు కాళ్ళు గోక్కుంటున్నవాడు అప్పుడు బొడ్డు దగ్గర గోక్కుంటూ.

"ఏంజేయలే. రాత్రికి యింటికి పోలేక బస్టాండు కాడ పండిన, పోలిసోల్లు లెగ్గొట్టి తీస్కపోయినరు. అట్ల అవారాగా వుంటె

## సైకో - సెక్సో - థెరపి

సంతానమునకు, గర్భ నిరోధమునకు, సుఖ వ్యాధులు, బహిష్టు వ్యాధుల నివారణకు, వక్షోజ సౌందర్యం కొరకు, బిడ్డకు బిడ్డకు మధ్య ఎడం, అంగం చిన్నదైనచో, నరముల బలహీనత పోగొట్టి వీర్యవృద్ధికి, వృద్ధాప్యములో యవ్వన శక్తి పొందుటకు, ధాతు పుష్టికి, ఇంకా అనేక ఆంతరంగిక సమస్యల పరిష్కారమునకు సంప్రదించండి.

డా॥ వై. వి. యస్. మోహనరావు,
10-19-28, దుర్గగుడి టర్నింగ్, బ్రాహ్మణవీధి
విజయవాడ—520 001.

Suvarna

## నెలకు రు. 1000/-లు సంపాదించండి

ఫొటోగ్రఫీ టీచర్ రు. 6/-; డ్రాయింగ్ & పెయింటింగ్ గైడ్ రు. 8/-; ట్రాన్సిష్టరు గైడ్ రు. 10/-; రేడియో గైడ్ రు. 10/-; వివాహపు జీవితం 100 బొమ్మలతో రు. 7/- మెడికల్ సెక్స్ గైడ్ 88 బొమ్మలతో రు. 10/-; టైలరింగ్ & కటింగ్ గైడ్ రు. 7/- 300 కుటీరపరిశ్రమ గైడు రు.15/-; ఎలక్ట్రిక్ గైడు రు. 10/- ప్రతి ఒక్కటి పోస్టేజి 1-50

ILFA BOOK DEPOT,
ALIGARH-25.

## వార్తలకు, వ్యాఖ్యలకు "ఆంధ్ర జ్యోతి" దిన పత్రికనే చదవండి.

డా॥ పి.వి.కె.రావ్, B.A., సెక్స్ స్పెషలిస్ట్



వైద్యవిద్వాన్, వైద్యాచార్య హస్తప్రయోగం, నరముల బలహీనత, అంగము చిన్నదగుట, శీఘ్ర స్ఖలనము-శక్తినష్టము, సుఖ రోగములకు మానసిక వ్యాధులకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా కూడా చికిత్స గలదు.

రావూస్ క్లినిక్,
టి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700.

SUVARNA


జేతేనంట" అన్నాడు రాముడు ఏడుపు మొగంతో.

వాడు నవ్వాడు. వాడికి సంవత్సరం పడిందట. పెద్ద దొంగతనమేనట.

తరువాత్తరువాత అందరూ పరిచయమయ్యారు. ఒకడు సైకిల్ దొంగ. ఒకడు రైల్వే బొగ్గుల దొంగ. ఇంకొకడు ఎవర్నో కొట్టాడంట. కాని చాలమంది అసలు సంగతి చెప్పరు. అసలు పేరు చెప్పరు.

మొన్న ఒక అబ్బాయి వచ్చాడు. పాంటూ, షర్టూ వేసుకున్నాడు. హిప్పీ లాగ పెంచాడు తల. సిగరెట్ తాగుతూ లోపలకు వచ్చాడు. మొదట మొదట బింకంగ వుండేవాడు. అక్కడున్న అందరిలో తానేదో ప్రత్యేకం అన్నట్టు కాలేజ్‌లో గలాటా జరిగి వచ్చానంటాడు.

అప్పటి సర్కిల్ వార్డర్ బ్రాహ్మడని తెలుసుకుని తాను బ్రాహ్మణ్ణని చెప్పుకున్నాడు. ఆ వార్డర్ విడుదలయి యింకో వార్డర్ వచ్చాడు. కొత్త వార్డర్ నాయుడు. అందుకని నాయుణ్ణని చెప్పుకో సాగాడు. ఏమిట్రా యిదీ అని నిలదీసి అడిగితే బ్రాహ్మణ నాయుడిని అంటాడు.

బ్రాహ్మణ్ణాయుడు గుర్తుకొచ్చి తనలో తానే నవ్వుకున్నాడు రాముడు.

మొత్తానికి ఆర్నెల్లు ఆర్రోజుల్లాగ గడిచిపోయాయి. పగలంతా జైలరు ఆఫీసులో పని. సూపర్నెంటుకూ, జైలరుకూ మధ్య కాగితాలు చేర్చేసే పని తనది. పని తక్కువ, తిరగడమెక్కువ.

ఆరుగంటలకంత లాకప్. తలుపులు బంధించాక యిక బారక్‌లో ఒకటే అల్లరి రాత్రి తొమ్మిదీ పదిగంటలవరకు. నిద్రలో పళ్ళు కొరుకుతూ బూతులు తిట్టేవాడు. పాటలు పాడుతాడు. బ్రాహ్మణ్ణాయుడు అన్నం తినే సత్తుగిన్నె తిరగేసి తబలా కొడతాడు. వాళ్ళపాటలు వింటూవుంటే అదోలా అయిపోతుంది మనస్సు. జైలు గోడలు కరిగిపోయి తామంతా బయటకి ఈదుకుంటూ వెళ్ళిపోతున్నామనీ, బయట అమ్మ తనను ఒళ్ళోకి తీసుకు ముద్దుపెట్టుకుంటోందనీ కలలు కంటాడు రాముడు. కాని అది ఎంతోకాలం నిలవదు.

ఒక గుంపు ఒక మూలకు చేరతారు. చిలుమగొట్టం తీసి పొగ బయటకి కనిపించకుండా గంజాయి కొడతారు. మత్తెక్కేకొద్దీ ప్రతివాడూ కళాకారుడే. బూతు పాటలు, నవ్వులు, చిందులు, చివరకు వొకణ్ణొకడు తిట్టుకుంటారు. కొట్టుకుంటారు. అల్లాగే అలిసిపోయి నిద్రపోతారు.

ఏది యేమైన ఈ ఆర్నెల్లలో చెమ్మ బారి నాచుపట్టిన జైలు గోడల్లో; బారక్, బారక్‌కూ వుండే వుక్కు కటకటాల్లో తాను ఒక భాగమై పోయాడు. కొన్నాళ్ళ తర్వాతైనా తను జైలు బయటికి మామూలు ప్రపంచంలోనికి వెళతాననే సంగతే మర్చిపోయాడు.

అప్పుడప్పుడు అమ్మ గుర్తుకొస్తుంది. గోడలు గోడలుమీద మూడు వరుసల కరెంటు తీగెలు. తీగెలతో కత్తిరించినట్టు తెగిపోయిన ఆకాశం. తెగిపోయిన ఆకాశం అవతలి తునక కింద ఎక్కడో వుంది అమ్మ.

తను కనిపించకుండాపోతే ఎంత ఏడ్చిందో. తాను జైలుకు వెళ్ళాడని ఎవరు చెబుతారు ఆమెకు.

వారానికి ఒక కార్డు యిస్తారు. యింటికి రాసుకోడానికి. తను మొదట రెండు మూడు కార్డులు రాయించాడు జవాన్ను బతిమాలి. జవాబు మాత్రం రాలేదు.

ఎట్లా బతుకుతూందో? ఈ రోజు తను అమ్మ దగ్గరకు వచ్చేస్తాడని ఆమెకు ఎవరు చెబుతారు.

రాముడి కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగాయి.

ఆమెకెవరున్నారు తను తప్ప. ఆమెకు ఏ జ్వరమొవస్తే ఎవరు చూస్తారు. పాపం పిచ్చి తల్లి. తనంటే ప్రాణం, తన కోసమే ఆమె బతికేది.

ఠంగ్‌మంది జైలు గేట్లో గంట.

ఎన్ని గంటలు కొట్టారో రాముడు యెంచుకోలేదు. బయటకు చూశాడు. కటకటాల్లోంచి ఉదయ సూర్యుని కిరణాలు తెల్లగా నవ్వుతున్నాయి. బారక్‌లో చీకటి పారిపోయింది. ఇప్పుడు తనతోడి పిల్లలంతా స్పష్టంగా కనిపిస్తున్నారు.

ఇంతలో లాకప్ తాళంతీస్తున్నచప్పుడు. జవాన్ కటకటాల పుక్క తలుపు లోపలికి తోశాడు. అది శబ్దం చేయకుండా తెరుచుకుని గోడకు కొట్టుకుని బరువుగా మూల్గింది.

రాముడు జవాన్‌కు నమస్కారంపెట్టి నవ్వాడు.

"ఏంరా, ఈ రోజు రిలీ జంట కదా నీది" జవాన్ నవ్వుతూ పలకరించాడు, లాఠీకర్ర విలాసంగా తిప్పుతూ.

రాముడు ఏమీ మాట్లాడకుండా తలూపాడు.

పిల్లలంతా నిద్దర్లేచారు. ఆవలిస్తూ, బద్ధకంగా బిస్తర్లు మడిచి గోడవారకు తోశాడు.

ఇద్దరు ముగ్గురు పెద్దబ్బాయిలు చీపురు కట్టా, ఫినైల్ బకెట్టూ తీసుకుని బయల్దేరారు. వాళ్ళు సఫాయి పని చేస్తారు.

రాముడు బయటకు వచ్చాడు.

పక్క బారకుల్లోంచి పెద్ద ఖైదీలు బయటకు వస్తున్నారు, గడ్డాలు అడ్డదిడ్డంగా పెరి

గిన వాళ్ళు. ఎన్నడూ స్నానంచేసి ఎరగని చమట శరీరాలవాళ్ళు. జైలు బట్టలు సర్దుకుంటూ, టోపీలు చేతులతో సాపు చేసుకుని తలలమీద పెట్టుకుంటూ.

కాసేపట్లో బాట్నీ మొదలయ్యింది. పిల్లలూ, పెద్దలూ సత్తుప్లేట్లూ సత్తులోటాలు పట్టుకుని వరుసగా కూర్చున్నారు. అన్నమూ, పల్చని గోంగూరపప్పూ. కొలత ప్రకారమేగాని, వార్డర్ అందాజ్‌గా పంచేస్తున్నాడు. పప్పు బకెట్టు పట్టుకున్న వాడి కాళ్ళనిండా పప్పు పెయింటు పడుతోంది.

పిల్లలు కొంత తిని కొంత మధ్యాహ్నానికి దాచుకున్నారు.

రాముడికి అసలు తినబుద్ధి కావడంలేదు. ఎలాగో వుంది మనస్సు. ఆనందమో, విచారమో చెప్పలేడు. మెదడుకు తిమ్మిరి పట్టినట్టుంది. మిగిలిన అన్నం గిన్నెలో దాచుకోబోయి. తానిక కాసేపట్లో బయటికి వెళ్ళిపోతానని గుర్తుకొచ్చి దాన్ని స్నేహితులకు యిచ్చాడు. ఆ మాత్రానికే ఎంతో కృతజ్ఞతగా చూశారు వాళ్ళు.

మరికాసేపటికి జవాన్ వచ్చి పిలిచాడు బయటకు వెళ్ళవుగాని రమ్మని.

రాముడు ఒక్కసారి రెక్కలు విదిలించుకున్న పక్షిలా చుట్టూ చూశాడు. ఎన్నాళ్ళుగా చూస్తున్నాడో ఈ పసుపుపచ్చ గోడల్ని. చూసి చూసి వాటితో ఒక రకమయిన ఆత్మీయత పెరిగింది. ఎండకు తన నీడకింద ఆశ్రయమిచ్చే మామిడి చెట్టు, మొదట దడుసుకున్నా అలవాటు పడిన వురి స్తంభం. తనతోపాటు నవ్విన ఆడిన, పాడిన, ఏడ్చిన ఖైదీలు.

ఆఫీసులో జైలరు రాముడికి బట్టలు యిచ్చేశారు. వాటివైపు పిచ్చిగా చూశాడు. జైలుకు వచ్చేముందు దసరా పండుగనాడు కుట్టించింది అమ్మ. "మీ నాన్న వుంటె యెంత మంచి బట్ట కుట్టించునో" అని కన్నీళ్ళు పెట్టుకుంది.

తను నాన్నగార్ని చూడనేలేదు. నాన్నగారు యెప్పుడో తనకు జ్ఞాపకం రాకముందే పోయాడు. తనకు తెలిసిందల్లా అమ్మే. పాచిపని చేసో, కారేజీలు మోసో, మరేంచేసో తనను పెంచుకు వచ్చిన అమ్మ. వెళ్ళాలి. అమ్మకు విశ్రాంతి యివ్వాలి. ముసలి తల్లి, ఎంత సంతోషిస్తుంది తనను చూసి.

బట్టలు మార్చుకుని జైలరు వైపు చూశాడు.

"పో. ఇంకెప్పుడు రావద్దు. వెళ్ళిక" జైలర్ విసుగ్గా అన్నాడు.

గేటు తెరిచారు.

రాముడు తలొంచి అవతలకు దాటి కొంత దూరం నడిచాడు. జైలు కాంపౌండు దాటి రోడ్డు మీదకు వచ్చి నించున్నాడు.

వీణ అందరూ వాయిస్తారు, కానీ అందరికీ అన్ని రాగాలు అంత అద్భుతంగా పలకవు. ప్రేమికుల మానసవీణ మరీ విచిత్రమైనది. ప్రేమ సోకిందా అది మధురగానాలమంజుల రవళే, లేదా రాజీ సంగీతమే!

"ఆంధ్రజ్యోతి" పాఠకులకు ప్రసిద్ధ నవలా రచయిత్రి

శ్రీమతి కావిలిపాటి విజయలక్ష్మి

సమర్పిస్తున్న ఆనంద ధారావాహిక

"మానస వీణ"

29-6-79 సంచిక నుంచి ప్రారంభం!

తన వెనుక భూతంలాగ ఎంతో ఎత్తుగా జైలు. టపర్. ఆ పైన ముచ్చటగా మూడు రంగుల జెండా అర్థం పర్థంలేకుండ ఎగురుతోంది.

రోడ్డుమీద రకరకాల వాహనాలు. రంగు రంగుల బట్టల్లో మనుషులు. ఎప్పుడో వదిలిపోయిన ఆత్మీయుల్లా వాళ్ళ వేపు చూశాడు. జైలునుండి వచ్చాడని నవ్వుతారేమోనని తలొంచుకున్నాడు.


ఏమీ పాలుపోక కాసేపలాగే నుంచున్నాడు. బయటి యెండ యెందుకో విచిత్రంగా తనమీద విరిగి పడుతున్నట్టనిపించింది రాముడికి.

తన యిల్లు చాలాదూరం. ఇంటిదారి పట్టి నడవసాగాడు.

అన్నిరకాల వాహనాల హారన్ల మధ్య, ట్రిన్ ట్రిన్‌మనే రిక్షా బెల్లుల శబ్దాలు ఆత్మీయంగా, సొంత గుండెల చప్పుళ్ళ లాగ వినిపిస్తున్నాయి.

జైలుకు రాకముందు సంవత్సరంగా తను రిక్షా లాగడం మొదలెట్టాడు. అమ్మ "వద్దురా నువ్వింకా చిన్నోడివి" అంది. కాని తను సంపాదించక తప్పదు. అమ్మ యిక ఏమాత్రం పని చేయలేనంత ముసలిదైపోతోంది.

పొద్దున్న రిక్షా అద్దెకు తీసుకుంటే రాత్రి పదిగంటలకల్లా సేటుకు అప్పజెప్పేవాడు. కిరాయి పోను మూడు నాలుగు



రూపాయలన్నీ మిగిలేవి. బతుకట్లా గడిచేది.

రిక్షా సేటు యింటికీ తమ గుడిసెకూ చాల దూరం. అందుకని ఒక్కో రోజు రిక్షా యిచ్చేసి అక్కడే బస్టాండులో పడి నిద్రపోయి తెల్లారేలోగా యింటికి వెళ్ళేవాడు.

అట్లా బస్టాండులో నిద్రపోతూంటే ఒక రాత్రి ఎవరో లేపారు.

కానిస్టేబుల్ బూటుకాలితో తన్ని లేపాడు. తను గాభరాగా భయం, భయంగా వణుకుతూ చూస్తూంటే స్టేషన్‌కు తీసుకెళ్ళాడు.

అవారా కేసు పెట్టి జైలుకు పంపారు. ఇదిగో, ఈ రోజు తిరిగి యింటికొస్తున్నాడు.

రాముడి అడుగులు ఎవరో చెప్పినట్టు ఆగిపోయాయి. యిల్లొచ్చింది గుడిసెల బయట పెద్దవాళ్ళెవరూ లేరు. ఇద్దరు ముగ్గురు పిల్లలు మాత్రం రోడ్డు మీద ఆడుకుంటున్నారు. మట్టి మొగాల, చీమిడి ముక్కుల పిల్లలు.

తమ గుడిసె తలుపు దగ్గరగా వేసివుంది. లోపల పాత్రల చప్పుడు వినిపిస్తోంది. చిన్నగా పాదాల ధ్వనికూడ వినిపిస్తోంది. ఫరవాలేదు అమ్మ ఆరోగ్యంగానే వుంది అనుకున్నాడు రాముడు.

ఆనందంతో గుండె వేగంగా కొట్టుకో సాగింది. ఒక్క క్షణం ఏమీ చేయలేని వాడిలా ఆగి తలుపులు తోసుకుని లోపలికి నడిచాడు.

"ఎవరూ" ఎవరిదో కొత్త గొంతుక.

అదిరిపడి గడపలోనే నిలబడ్డాడు. ఎవరో నలభై ఏండ్లామె. ఆమె ముఖం నిండా చెమటతో తడిసిన పొగమసి. దాని కిందనుండికూడ దాగని విసుగు. "ఎవరున్నవ్వు. ఆదట్న యింట్లోకే వస్తున్నావే ఏమెత్తుకు పోదామనీ."

"ఇది....యిది....లచ్చమ్మ యిల్లు కద. లచ్చమ్మ కేమయింది. నువ్వెవ్వరు" మాటలుతడబడు తున్నయి.

"లచ్చమ్మెవరో, పుచ్చమ్మెవరో మా కెరకలేదు. ఈ యింట్లో ఒగ ముసిల్దుండె. దాని కొడుకు దొంగతనమో యేమోచేసి జేలు ఖానకు వోయిండంట. అది మంచం పట్టి చచ్చిపోయింది. ఆకాడ్నుంచి మేముంటన్నం."

రాముడు మాటా, పలుకా లేకుండా నుంచున్నాడు. [illegible] "అమ్మ" అన్న ఆ[illegible] తిరుగుతోంది.

* * *

ఆంధ్రజ్యోతి
సచిత్ర వార పత్రిక
పిల్లలకి పరీక్షలయాయా?
ఎండల్లో సెలవల్లో అల్లరి
పిలల్ని ఎలా కాయడం అని
ఆరాటపడుతున్నారా ?
మీరూ, మీ పిల్లలూ అంతా
రోజూ ఓ గంట
'కార్టూన్
చిత్రకళ'ను
నేర్చుకోండి!
వారం వారం
మీ సరదాకోసం
కార్టూన్ల 'గీతారహస్యం'
సచిత్ర వ్యాస పరంపర
త్వరలో ప్రారంభం!
నిర్వహణ:
శ్రీ టీవీ

మిట్ట మధ్యాహ్నం. ఎండ మండిపోతోంది.

రాముడు రోడ్డు మీద నుంచున్నాడు,

ఆకలేస్తోంది.

నిన్న ఉదయం జైల్లో తినీ తినకా తిన్నదే.

కొళాయి నీళ్ళు తాగి తాగి కడుపులో తిప్పుతోంది.

ఎదురుగ్గా హోటల్లోనికి జనం పోతున్నారు. తింటున్నారు. తిన్నవాళ్ళు కబుర్లు చెప్పుకుంటూనో, సిగరెట్లు పీలుస్తూనో వస్తున్నారు. అద్దాల పెట్టెలో ఫలహారాలు రాముడ్ని పరిహాసం చేస్తున్నయ్.

పదో మారు అప్రయత్నంగా జేబుల్లో చేయిపెట్టుకున్నాడు. ఉంటేగా ఏమైనా, తగలడానికి.

ఎవరో పెద్దమనిషి హోటల్లోంచి బయటకు వచ్చాడు; పల్చని తెల్లని టెరికాటన్ లాల్చీ తొడుక్కున్నాడు. జేబులోంచి నల్లని పర్సు స్పష్టంగా కనిపిస్తోంది.

జైల్లో విన్న పిక్‌పాకెట్ ట్రిక్కులు గుర్తుకొచ్చాయి.

పెద్దమనిషి పక్కగా నడిచాడు. అతగాడు రిక్షా కోసం కాబోలు రోడ్డు చివరకు చూస్తున్నాడు. రాముడు మెల్లగా అతడి జేబులోనికి చేయి దూర్చాడు. పర్సు చల్లగా పాములా తగిలింది. రాముని చేయి వణికింది. జాగ్రత్తగా తీశాడు.

వణుకుతున్నచేయి అతగాడికి తగిలింది. అంతే-వులిక్కిపడిచూసి "దొంగ దొంగ" అని తోక కోసిన మేకలా గాభరాగా. ప్రాణమంతా గొంతులోనికి తెచ్చుకుని అరుస్తున్నాడు.

రాముడు పేవ్‌మెంటుమీంచి దూకి పరిగెత్తాడు.

రెండడుగులు వేశాడో, లేదో కానిస్టేబుల్ కాలర్ పట్టుకుని వెనక్కిలాగాడు.

జనం చేరారు. ఇష్టం వచ్చినట్టు కొట్టారు. అందరూ అలసి పోయాక కానిస్టేబుల్ పర్సు పెద్దమనిషిని రమ్మని రాముడ్ని తోసుకుంటూ స్టేషన్‌కు తీసుకెళుతున్నాడు.

తల తిరుగుతోంది. కాళ్ళు తేలిపోతున్నాయి. కళ్ళమీద రెప్పలు మూసుకుపోతున్నాయి. అంతా గజిబిజి. గందరగోళం. మనుషులు గాలిలో తేలే దయ్యాల్లా కనిపిస్తున్నారు. వాళ్ళందరిమధ్య తెల్లని బట్టలు కట్టుకున్న ముసిల్ది ఆకాశంకేసి యెగిరి పోతోంది. ఆమె చేతులు గాలిలో నిస్సహాయంగా దేనికోసమో వెదుక్కుంటున్నాయి. అమ్మ....అమ్మ.

ఇంతలో జైల్లో ఎవరో అన్నమాటలు రాముడి చెవిలో మళ్ళీ తిరిగాయి.

"ఒకమారు ఎవడయినా యిక్కడకు వచ్చాడంటే - యిక అంతే. వాడు మళ్ళీ మళ్ళీ, మళ్ళీ, మళ్ళీ వస్తూనే వుంటాడు."

రాముడి కళ్ళముందు జైలు గేటు భూతం నోరులా తెరుచుకుంటోంది.

విచిత్రంగా నవ్వొచ్చింది.

రెండుపూటలా తిండి గుర్తుకొచ్చింది.

ఈ ఆలోచన యింతకుముందే ఎందుకు రాలేదా అని ఆశ్చర్యపోయాడు రాముడు.